# పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలను అమలు చేస్తాం ● సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**కొత్తూరు:** పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. నిజమైన అర్హులను గుర్తించి ఈ ప్రభుత్వం అమలు చేసే ప్రతీ పథకం సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖలకు చెందిన అధికారులు తమతమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా అర్హులకు అందే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో వారి అనుచరులకు మాత్రమే ఇచ్చినట్లు ఆరోపించారు. ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహించే అధికారులు ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలన్నారు.

**పథకాలకు సరైన మార్గదర్శకాలు లేవు..**

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన మిషన్ భగీరథ, గొర్రెల పంపిణీ, రైతుబంధుతో పాటు పలు పథకాలకు సరైన మార్గదర్శకాలు లేవన్నారు. ఈ పథకాల మాటున రాష్ట్ర వ్యాప్తంగా కోట్ల రూపాయల దోపిడీ జరిగిందన్నారు. ప్రతి ఇంటికి మిషన్‌భగీరథ పథకాన్ని ప్రారంభించిన ప్రభుత్వం నీటి సరఫరాకు సరైన డిజైన్లు చేయలేదన్నారు. కార్పొరేట్ సంస్థలు, భారీ నిర్మాణాలు, కట్టడాలు ఉన్న పొలాలకు కూడా గత ప్రభుత్వం కోట్ల రూపాయలు రైతుబంధు ద్వారా కట్టబెట్టిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన తర్వాతనే రైతుబంధు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. గొర్రెల పంపిణీ పథకం రాష్ట్రంలోనే అతిపెద్ద స్కాంగా ఉందన్నారు. లబ్ధిదారుల ఎంపిక నుంచి గొర్రెల కొనుగోలు వరకు పెద్ద ఎత్తున కమీషన్లు చేతులు మారినట్లు ఆరోపించారు. అంతకు ముందు లబ్ధిదారులకు షాదీముబారక్, కళ్యాణలక్ష్మీ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. అంతేకాకుండా బదిలీపై వెళ్లిన ఎంపీడీవో శరత్‌చంద్రబాబును ఎమ్మెల్యే శాలువా కప్పి సన్మానించారు. మండలంలోని గూడూరు, మక్తగూడతో పాటు పలు గ్రామాల్లో సీసీరోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, వైస్ చైర్మన్ రవీందర్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో అరుంధతి, ఎంపీటీసీలు, సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌ముదిరాజ్, నర్సింహ్మా, దేవేందర్ యాదవ్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

# తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్

జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్

**తలకొండపల్లి:** తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు ఇమిడి ఉందని జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. బుధవారం మండలంలోని జంగారెడ్డిపల్లి, పెద్దూర్‌తండాల ప్రాథమిక పాఠశాల్లో రూ. 20 లక్షల మండల పరిషత్ నిధులతో నిర్మించిన అదనపు తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిలుగా ఎంపిపి తిర్మణీ నిర్మలతో కలిసి అదనపు గదులను వెంకటేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి లక్ష్యాన్ని చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన ఉండాలన్నారు. అనంతరం జెడ్పీటీసీ, ఎంపీపీలను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీకాంత్, ఎంపీఓ రఘు, స్పెషల్ ఆఫీసర్ రమేష్‌నాయక్, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు రమేష్, రఘు, మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు ఎంపీటీసీ జోగు రమేష్, సోని, లక్ష్మి, కో ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, సింగిల్‌విండో డైరెక్టర్లు శేఖర్‌యాదవ్, హెచ్‌ఎంలు అనురాధ, పవన్‌కుమార్‌రెడ్డి, శ్రీశైలం, కార్యదర్శిలు జానయ్య పాల్గొన్నారు.


అదనపు తరగతి గదిని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు

# ‘సఫాయి’ల ఆర్థిక అభివృద్ధికి కృషి

కమిషనర్ సత్యనారాయణరెడ్డి

**తుర్కయంజాల్:** సఫాయి కర్మచారిల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తామని పుర కమిషనర్ బి. సత్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కొహెడ వార్డు కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నమస్తే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. సఫాయి కర్మచారిలు విధుల నిర్వహించే సమయంలో తప్పనిసరిగా రక్ష పరికరాలను ధరించాలని, మురికి కాలువలు శుభ్రపరిచేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, కేంద్ర ప్రభుత్వ అనుబంధ నేషనల్ సఫాయి కర్మచారి ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలోని సబ్సిడీలు పొంది ఆర్థికంగా బలపడాలని సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ హరీశ్, మున్సిపల్ సిబ్బంది భానుమతి, రోజా పాల్గొన్నారు.


సఫాయి కర్మచారిలతో కమిషనర్ సత్యనారాయణరెడ్డి

# రాష్ట్రాన్ని అప్పుల్లో నెట్టారు

గిరిజన సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ రఘు, పీసీసీ సభ్యుడు బాబర్‌ఖాన్

**షాద్‌నగర్:** బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా పదేళ్లు రాష్ట్రాన్ని పరిపాలించి అప్పుల్లో నెట్టారని కాంగ్రెస్ గిరిజన సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ రఘు, పీసీసీ సభ్యుడు బాబర్‌ఖాన్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. షాద్‌నగర్ సమావేశంలో మాజీ మంత్రి హరీశ్ రావు మతిభ్రమించి మాట్లాడారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పి ప్రజలను మోసం చేసిన వ్యక్తి కేసీఆర్ అని విమర్శించారు. రైతులకు రుణ మాఫీ చేస్తామని చెప్పి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేతులెత్తేసిన విషయాన్ని వారు గుర్తు చేశారు. ఇంటికో ఉద్యోగం అన్నారు? ఇచ్చారా? అని వారు ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగులను నిండా ముంచిందన్నారు. ప్రజలకు మాయ మాటలు చెప్పి రాష్ట్రాన్ని అప్పుల్లో నెట్టిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే చెల్లిందన్నారు. ప్రజల్లో సీఎం రేవంత్‌రెడ్డికి పెరుగుతున్న ఆదరణ చూసి బీఆర్‌ఎస్ నేతలు ఓర్వలేకనే విమర్శలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో చెంది తిరుపతిరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, శ్రీను నాయక్, గంగనమోని సత్తయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రఘు, బాబర్‌ఖాన్

## అక్రమ నిర్మాణాలపై విచారణ జరపాలి

**హుడాకాంప్లెక్స్:** సిరీస్ ఫార్మా కంపెనీకి గత ప్రభుత్వం కేటాయించిన భూముల్లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై విచారణ చేపట్టాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాములు బుధవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. అప్పటి బహదూర్‌గూడ ప్రస్తుతం ఎల్‌బీనగర్‌లో సిరీస్ (సౌత్ ఇండియా రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్‌సైన్స్) ఫార్మా కంపెనీకి సర్వే నం-49/13లో 14 ఎకరాల 31 గుంటల భూమిని అప్పటి ప్రభుత్వం కేటాయించింది. రూ.500 కోట్ల విలువైన ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలకు అనుమతి ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. కావునా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దీనిపై స్పందించి సిరీస్ కంపెనీకి నాటి ప్రభుత్వం కేటాయించిన విలువైన ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఆయన కోరారు.


రాములు యాదవ్

# అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ఎంపీటీసీ ఉమావతి

**కడ్తాల్:** గ్రామాభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఎంపీటీసీ సభ్యురాలు ఉమావతి బుగ్గయ్యగౌడ్ కోరారు. బుధవారం మండలంలోని ఎక్వాయిపల్లిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టిన పలు సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ.. సీసీ రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో గ్రామాల అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందన్నారు. కావునా ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుమన్, యాదయ్య, రమేశ్‌నాయక్, కరుణాకర్, చోటే, వెంకటేశ్, బాలరాజు, అనిత, రాజు, జంగయ్య, నరేశ్, బీచ్యానాయక్, నరేశ్‌నాయక్ పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న ఎంపీటీసీ ఉమావతి

## క్లుప్తంగా

### 28న వైస్ ఎంపీపీ ఎన్నిక

**శంకర్‌పల్లి:** ఈ నెల 28వ తేదీన మండల పరిషత్ ఉపాధ్యక్షుడిని ఎన్నుకోనున్నట్లు శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్య గౌడ్ తెలిపారు. శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కురుమ రాములమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో ఈ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. చేవెళ్ల ఆర్డీవో సాయిరాం ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారని ఆయన పేర్కొన్నారు.

### కమిషనర్‌కు వినతి


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

**షాద్‌నగర్:** షబ్బే బరాత్‌ను పురస్కరించుకొని పట్టణంలోని మసీదుల్లో, శ్మశాన వాటిక వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టి మంచి నీటి సదుపాయం కల్పించాలని పలువురు మైనార్టీ నేతలు బుధవారం మున్సిపల్ కమిషనర్ వెంకన్నకు వినతి పత్రం అందజేశారు. ఈ నెల 25న షబ్బేబరాత్ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. మార్చి 11 నుంచి రంజాన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో చెత్త సేకరించే ఆటోలను సాయంత్రం వేళల్లో కూడా ఇఫ్తార్ తర్వాత మసీదుల వద్దకు పంపించి చెత్తను తీసుకెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

### భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు


అలంకరణలో స్వామివారు

**కడ్తాల్:** మండల కేంద్రంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు బుధవారం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే గురువారం స్వామి వారి కల్యాణం నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వేంకటేశ్వర శర్మ, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, ఉత్సవ కమిటీ చైర్మన్ వేణుగోపాల్, శ్రీధర్‌పంతులు, బాబు తదితరులు ఉన్నారు.

### బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారిగా రమేశ్



**తుర్కయంజాల్:** బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారిగా తుర్కయంజాల్‌కు చెందిన బచ్చిగళ్ల రమేష్‌ను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రమేష్ రెండు పర్యాయాలుగా రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా పని చేశాడని గుర్తు చేశారు. జిల్లాలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని రమేష్ పేర్కొన్నారు.

### నేటి నుంచి వేణుగోపాల స్వామి ఉత్సవాలు


ఉత్సవాలకు ఆలయం ముస్తాబు

**మంచాల:** నేటి (గురువారం) నుంచి ఆరుట్ల గ్రామంలో వేణుగోపాల స్వామి జాతర ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 22 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నారు. 22న కలశ స్థాపన, అంకుర్పన చేస్తారు. 23 రాత్రి 8-00 గంటలకు కల్యాణోత్సవం, 24న అగ్ని ప్రతిష్ఠాపన, రథాంగహోమం జరగనుంది. 25న ఉదయం రథోత్సవం ఊరేగింపు చేస్తారు. 26న హోమం, నాగవల్లి, పూర్ణహుతి నిర్వహించడం జరుగుతుంది. ఇప్పటికే ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేశారు.

### నూతన నియామకం

**మంచాల:** రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్‌ను ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తలకొండ కాంతయ్య బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈసందర్భంగా కాంతయ్య మాట్లాడుతూ.. మండలంలోని ఆస్మత్‌పూర్ గ్రామానికి చెందిన నర్ల శ్రీశైలం యాదవ్ సీపీఐ కార్యకర్తగా అంచలంచెలుగా ఎదిగి పార్టీ నిర్మాణం కోసం ఎంతో కృషి చేశాడని చెప్పారు. ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నుంచి పార్టీ అనుబంధ సంఘాలలో పని చేయడమే కాకుండా సీపీఐ మండల కార్యదర్శి , రైతు సంఘం మండల అధ్యక్షుడి, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా పని చేశారని గుర్తు చేశారు. పార్టీ పిలుపు మేరకు ఈ ప్రాంతంలో ప్రజా సమస్యలపై పోరాటం చేశాడని అన్నారు.

# లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీదే గెలుపు

● జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేష్‌గుప్తా

**షాద్‌నగర్:** రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యమని జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేష్‌గుప్తా పేర్కొన్నారు. పార్టీ అధిష్ఠానం చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్ర గురువారం షాద్‌నగర్‌కు చేరుకోనున్నట్లు ఆయన తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధించడమే లక్ష్యంగా పార్టీ అధిష్ఠానం ప్రజా సంగ్రామ యాత్రను నిర్వహిస్తుందన్నారు. కేంద్రంలో బీజేపీ తిరిగి అధికారంలో రావడం ఖాయమన్నారు. అత్యధిక సీట్లు సాధించేందుకు పార్టీ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తుందని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని ప్రధాని నరేంద్ర మోదీని కొనియాడారు. దేశం మరింత అభివృద్ధి చెందాలంటే అది కేవలం బీజేపీతోనే సాధ్యమన్నారు. ఈ ప్రజా సంగ్రామ యాత్రకు ముఖ్య అతిథిగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ విచ్చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## పనులు ప్రారంభం

**మీర్‌పేట:** మీర్‌పేట కార్పొరేషన్ పరిధి 27వ డివిజన్ ప్రగతిహిల్స్ కాలనీ కమ్యూనిటీహాల్ ప్రాంగణంలో ఓపెన్ జిమ్ పనులను కార్పొరేటర్ భిక్షపతిచారి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నాలుగేళ్లలో కాలనీని అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తేవాలని ప్రజలకు సూచించారు. ఓపెన్ జిమ్ పనులు త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మల్లేష్, రాజు, భాస్కర్, కృష్ణ, రాము, ధన్‌రాజ్, రామకృష్ణ, గోపాల్, భాస్కర్‌చారి, నరేష్ పాల్గొన్నారు.


జిమ్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

# మాతృభాషను ఆదరిద్దాం


సాంప్రదాయ దుస్తుల్లో చిన్నారులు

● ప్రధానోపాధ్యాయురాలు సక్కుబాయి

**షాద్‌నగర్ రూరల్:** అమ్మలాంటి మాతృభాషను ఆదరించి పరభాష వ్యామోహాన్ని వీడాలని ప్రధానోపాధ్యాయురాలు సక్కుబాయి పేర్కొన్నారు. బుధ వారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో సక్కుబాయి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాష గొప్పతనాన్ని తెలియచేస్తూ విద్యార్థులకు పద్యాలు, పాటలు, నాటికలు, సాంప్రదాయ నృత్యాలు, బుర్రకథ, ఏకపాత్రాభినయం, పొడుపుకథలు, ఉపన్యాసం, తెలుగు క్విజ్ పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు సక్కుబాయి మాట్లాడుతూ దేశ భాషలందు తెలుగు లెస్స, అలాంటి మధురమైన మాతృభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. దేశ భాషలలో మన తెలుగు భాషకు ఎంతో ప్రాముఖ్యత ఉందని గుర్తు చేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఉపాధ్యాయులను పూలమాలలు వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు అరుణ, బుగ్గమ్మ, శ్రీదేవి, జ్యోతిలక్ష్మి, గీతమ్మ, తల్లితండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పెండింగ్ వేతనాలు చెల్లించండి

సీఐటీయూ సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్

**చేవెళ్ల:** గ్రామ పంచాయతీలలో పనిచేసే కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ పేర్కొన్నారు. చేవెళ్లలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్మికులు చాలీచాలని వేతనాలకు గ్రామ పంచాయతీలలో పనిచేస్తూ కాలం వెళ్ల దీస్తున్నారని చెప్పారు. అలాంటి వారికి కూడా ప్రతీనెల వేతనం చెల్లించకపోతే వారు కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. రోజురోజుకు పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలు, పిల్లల చదువులు, పోషణ, తదితర ఖర్చులు కార్మికులకు పెనూ భారంగా మారుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతీ నెల 1వ తేదీన జీతాలు చెల్లిస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభు త్వం స్పందించి కార్మికుల వేతనాలు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే కార్మికులంతా కలిసి విధులు బహిష్కస్తామని ఆయన హెచ్చరించారు.

# నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు

● రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్

**శంకర్‌పల్లి:** నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు కీలకంగా ఉంటున్నాయని రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. పట్టణ కేంద్రంలో ప్రతిఒక్కరూ తమ ఇళ్లల్లో, దుకాణా సముదాయాల్లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కాలనీల్లో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిటెక్టివ్ సీఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

**శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించండి..**

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని శంకర్‌పల్లి డిటెక్టివ్ సీఐ నాగరాజు పేర్కొన్నారు. బుధవారం శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలోని గణేష్‌నగర్ కాలనీలో సైబర్ నేరాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అందరు కలిసి మెలిసి ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని చెప్పారు. మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వకూడదని హెచ్చరించారు. ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో పక్క ఇంటి వారికి గానీ, పోలీసులకు గానీ సమాచారం ఇచ్చి వెళ్లాలన్నారు.


మాట్లాడుతున్న డిటెక్టివ్ సీఐ నాగరాజు



శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్లో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న డీసీపీ శ్రీనివాస్

# ప్రమాదబీమా చెక్కు అందజేత

**మీర్‌పేట:** గ్రామీణ ప్రాంతాలకే కాకుండా పట్టణ ప్రాంత ప్రజలకు కూడా గాయత్రి బ్యాంకు సేవలందించడంలో కీలక పాత్ర పోషించడం అభినందనీయని మీర్‌పేట కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి అన్నారు. గాయత్రి కో ఆపరేటీవ్ అర్బన్ బ్యాంక్ ఖాతాదారు నల్లగొండ ధన్‌రాజ్ ఇటీవల ప్రమాదవశాత్తు మరణించగా, బుధవారం ఆయన భార్య జ్యోతికి ప్రమాదబీమా ద్వారా రూ.1 లక్ష చెక్కును విక్రంరెడ్డి అందజేశారు. ఖాతాదారులకు కనీస డిపాజిట్‌తోనూ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తూ పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రమాద బీమా కల్పించడంపై విక్రంరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శాఖ మేనేజర్ యెద్దు శివ చంద్రబాబు, సీనియర్ ఆఫీసర్ అల్లి రమేష్, జూనియర్ ఆఫీసర్ ఎల్.శ్రీనివాస్, కార్పొరేటర్ అనిల్‌యాదవ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

# సమావేశాన్ని జయప్రదం చేయండి

కాంగ్రెస్ నాయకుడు బిచ్యానాయక్



**కడ్తాల్:** 23న కల్వకుర్తిలో నిర్వహించనున్న నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశానికి, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని, ఆ పార్టీ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేయనున్నారని తెలిపారు. ముఖ్య అతిథులుగా సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో పాటు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు హాజరవుతారని చెప్పారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
జి. మల్లికార్జున్
9505507564